క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలని భట్టికి వినతి



గార్ల: పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం కొత్తగూడెంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సీపీఐ జిల్లా, మండల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి, కట్టిబోయిన శ్రీనివాసరావు, రాగం రమేశ్, జనార్దన్, వెంకటేష్, నాగేష్, సింగు రమేష్, వీరన్న, భీముడు, ఉపేందర్ రెడ్డి, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, లోకేష్, తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ విజేత నర్సంపేట



గూడూరు: మండల కేంద్రంలో నూనావత్ ధన్ రాజ్ స్మారకార్థం నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ ఫైనల్‌లో శనివారం నర్సంపేటకు చెందిన జట్టు మొదటి విజేతగా, ములుగు జిల్లా గంగారం మండలం పునుగొండ్ల టీం ద్వితీయ విజేతగా, గూడూరు జట్టు తృతీయ విజేతలుగా నిలిచాయి. మొదటి జట్టుకు షీల్డు తోపాటు నగదు రూ.30వేలు, ద్వితీయ రూ.20వేలు, తృతీయ జట్టుకు రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో దుశ్యంత్‌రెడ్డి, కంకటి ఉప్పలయ్య, ఎండీ. యాకూపాషా, కొరె కుమారస్వామి పాల్గొన్నారు.

కేడర్‌ను బట్టి కుర్చీ ఏర్పాటు



మహబూబాబాద్: 'సాక్షి'లో ఈనెల 17న మానుకోట మున్సిపల్‌లో 'జేఏ హల్‌చల్' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విధితమే. శనివారం ఈ విషయంపై కమిషనర్ టి.రాజేశ్వర్ వెంటనే స్పందించారు. వెంటనే కార్యాలయంలో అన్ని గదులను, కుర్చీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేడర్‌ను బట్టి కుర్చీల ఏర్పాటు ఉంటుందన్నారు. కాని జూనియర్ అసిస్టెంట్ దిలీప్ మాత్రం తనస్థాయిని మరిచి కమిషనర్ కంటే పెద్ద కుర్చీ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

డాక్టరేట్ ప్రదానం

కొత్తగూడ: ఏజెన్సీ ప్రాంతం నుంచి సాహిత్య రంగంలో ఒకరికి, సామాజిక సేవా రంగంలో సన్‌రైస్ యూనివర్సిటీ రాజస్థాన్ నుంచి మరొకరు గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. కొత్తగూడ మండలం జంగవానిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ రచయిత అమర్‌నాథ్, గోపాలపురం గ్రామానికి చెందిన వాసం వీరస్వామి సామాజిక సేవను డాక్టర్ చిన్నారావు వెల్‌ఫెయిర్ ఫౌండేషన్ వారు గుర్తించి ఢిల్లీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సన్‌రైస్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసి సత్కరించారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి

గూడూరు: మండలంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకుడు గజ్జి లింగన్న అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం పార్టీ కార్యాలయం ఎదుట నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొట్టెం అచ్చన్న, పెనక భరత్, శ్రీశైలం, వజ్జన్న, వెంకన్న, నర్సయ్య, రజిత, సతీష్, ఆదినారాయణ, యోగి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



గూడూరు: మండలంలోని రాములుతండాకు చెందిన బానోతు రాజేందర్ అనే రైతు పాడి గేదె తెగిపడిన విద్యుత్ వైర్‌కు తాకి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. బాధిత రైతు రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి గ్రామంలో ఈదురు గాలులతో కూడిన వర్షంతో పొలాల్లోని విద్యుత్ వైర్ తెగి పడింది. అటుగా వెళ్లిన పాడిగేదె వైర్‌ను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ.90వేల విలువ చేసే గేదె మృతి చెందిందని బాధితుడు విలపించాడు.

ఔషధ గుణం.. ఆరోగ్య ప్రదం

- తాటి ముంజలు వేసవి తాపానికి ఉపశమనం
- చక్కని రుచి, ఎన్నో పోషకాలు

సండే స్పెషల్

పెద్దవంగర: వేసవి తాపాన్ని అధిక మించేందుకు ఈ కాలంలో శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారించి ఆరోగ్య ప్రయోజనాలు చేకూర్చేందుకు ప్రకృతి ప్రసాదించిన వరం తాటి ముంజలు. ఇవి ఐస్ యాపిల్‌గా విశేష ప్రాచుర్యం పొందాయి. తాటి ముంజల సీజన్ ప్రారంభం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వీటిని ఎక్కువగా తింటున్నారు. పొలాల గట్ల మీద, ఖాళీ ప్రదేశాల్లో పెరిగే తాటి చెట్ల నుంచి వచ్చే తాటి ముంజల్లో కల్తీ లేకుండా, మందులు వాడకుండా తాటికాయల నుంచి తీసిన ముంజలు కావడంతో ఎంతో ఇష్టంగా తీసుకుంటున్నారు.



ముంజలు తీస్తున్న గీత కార్మికులు



తాటి రేకలో కట్టిన ముంజలు

సమృద్ధిగా పోషకాలు..

ప్రకృతి ప్రసాధించిన స్వచ్ఛమైన తాటి ముంజల్లో ఎన్నో ఆరోగ్యపరమైన పోషకాలు ఉన్నాయి. నీటి మోతాదు ఎక్కువ కలిగి ఉండడంతో ఎండల్లో వేడి నుంచి తక్షణ ఉపశమనం దొరుకుతోంది. వీటిని తినడం ద్వారా వడదెబ్బ తగలకుండా శరీరాన్ని కాపాడుతాయి. శరీర ఉష్ణోగ్రతను తగ్గించి డీహైడ్రేషన్ రాకుండా మేలు చేస్తాయి. విటమిన్ బి7, పొటాషియం, కాల్షియం, జింక్, ఐరన్ వంటి పోషకాలు కలిగి ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతోంది. క్యాన్సర్ రాకుండా కాపాడడమే కాకుండా రక్తపోటు తగ్గించి శరీరంలోని మలినాలను బయటకు పంపుతాయి. కడుపు ఉబ్బరం, వికారం, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచి లివర్ సమస్యలను తొలగించి చర్మాన్ని కాపాడుతాయని వైద్యులు పేర్కొంటున్నారు.

రుచిగా ఉంటాయి..



తాటి ముంజలు మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది. లేతవి తింటే రుచిగా ఉంటాయి. మా ఊరిలో ఉన్న తాటిచెట్ల నుంచి గెలను తీసుకొని తింటాం. ఎండకాలం కావడంతో చల్లదనాన్ని ఇచ్చి దాహార్తిని తీరుస్తుంది. సరదగా గడుపుతూ తాటి వనంలోకి వెళ్లి తాటి చెట్ల నుంచి కాయలను తీసి, కోసుకొని తింటాం. అదో తియ్యని జ్ఞాపకం.
- సుంకరి మురళీధర్, పెద్దవంగర

ముంజలు అంటే ఇష్టం



వేసవి రాగానే వెంటనే గుర్తుకు వచ్చేది తాటి ముంజలు. తాటి ముంజలు అంటే ప్రతి ఒక్కరికి ఎంతో ఇష్టం. వేసవిలో మా కుటుంబ సభ్యులు వారంలో మూడు రోజులైన తాటి ముంజలు తింటారు. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు.
- మద్దెల యాకయ్య గౌడ్, పోచారం

పెద్దచెరువు శిఖం భూమి సర్వే

సాక్షి ఎఫెక్ట్..



సర్వే చేస్తున్న అధికారులు

గార్ల: 'చెరువు శిఖం భూమి కబ్జా' అనే శీర్షికన రెండు రోజుల క్రితం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి శనివారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించారు. గార్ల పెద్దచెరువులో ఆక్రమణకు గురైన చెరువు శిఖం భూమిని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 100ఎకరాల పైచిలుకు కబ్జాకు గురైందని తమ దృష్టికి వచ్చిందని, చెరువు మొత్తం పూర్తిగా సర్వే చేస్తే కబ్జాకు గురైన ఎకరాల వివరాలు తెలుస్తాయని అధికారులు పేర్కొన్నారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పరించనున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. సర్వేలో ఇరిగేషన్ డీఈ కృష్ణ, ఏఈ వంశీకృష్ణ, తహసీల్దార్ ఆర్ శారద, సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ లూర్దు, సర్వేయర్లు నందూలాల్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుతో సంబురాలు



స్వీట్లు తినిపించుకుంటున్న జేఏసీ నాయకులు

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణ అమలు, చట్టబద్ధత పొందడంతో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 9.75 శాతం రిజర్వేషన్లు కల్పించి మాదిగల అభివృద్ధికి కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు. మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణప చట్టబద్ధతపై గ్రామ గ్రామాన ఉత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం సంబరాలు నిర్వహిస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, శ్రీధర్, వీరన్న, రంగన్న, నరేష్, వెంకన్న, మనోహర్, నాగరాజు పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్.మాలతి

కేసముద్రం: రైతులు పురాతన మూస పద్ధతులను విడనాడి, నూతన వ్యవసాయ పద్ధతులను పాటించాలని, అప్పుడే మంచి దిగుబడులను సాధించవచ్చని కేవీకే మల్యాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.మాలతి, శాస్త్రవేత్తలు రాంబాబు, క్రాంతికుమార్ అన్నారు. శనివారం కేసముద్రంలోని రైతువేదిక భవనంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. వచ్చే వానాకాలం సీజన్ 2025-26లో పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలని, వరి పంటలో నేరుగా విత్తనాలు వెదజల్లి మంచి దిగుబడులు సాధించాలన్నారు. తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు, ధన్నసరి సొసైటీ చైర్మన్ మర్రి రంగారావు, ఏఓ వెంకన్న, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు తోట వెంకన్న, ఏఈఓలు రాజేందర్, రవివర్మ, శ్రీనివాస్, సాయిచరణ్, రైతులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల పూసపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపిక శనివారం కేసు వివరాలు వెల్లడించారు..గ్రామానికి చెందిన సమ్మెట శ్యామ్ (45) అతడి భార్య అనురాధా ఇద్దరి మధ్య కుటుంబ తగాదాలు చోటుచేసుకోగా ఏడేళ్లు దూరంగా ఉన్నారు. మళ్లీ ఏడాది కాలం నుంచి కలిసి ఉంటుండగా హనుమకొండలో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న శ్యామ్ ఈనెల 14వ తేదీన స్వగ్రామమైన ఈదులపూసపల్లికి వచ్చాడు. భార్య అనురాధ హనుమకొండలోనే ఉండగా అతడు శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడి మృతి చెందాడు. తల్లి సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శనివారం పోస్టుమార్టం అనంతరం వారికి అప్పగించామని ఎస్సై తెలిపారు.

రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలి

- జెడ్పీ సీఈఓ పురుషోత్తం



నిర్వాహకులతో మాట్లాడుతున్న పురుషోత్తం

మహబూబాబాద్ రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ పురుషోత్తం అన్నారు. మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతూ ధాన్యం వచ్చిన మేరకు గన్ని సంచులు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. లారీల సకాలంలో వస్తున్నాయా.. లేదా.. ధాన్యం ఏమైనా తడిసిందా.. రైతులకు ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాగానే పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ సుమలత, సీఏ నారాయణసింగ్, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన

కేసముద్రం: మండలంలోని అన్నారం, తాళ్లపూసపల్లి, కల్వల, కోరుకొండపల్లి క్రాస్‌రోడ్డు, మహముద్‌పట్నం, పెనుగొండ, ఉప్పరపల్లి, కాట్రపల్లి, ఇంటికన్నె, మున్సిపాలిటీ పరిధిలోని ధన్నసరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ఎర్రయ్య శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈమేరకు కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే షిఫ్టింగ్ చేయాలని సెంటర్ ఇన్‌చార్జ్‌లను ఆయన ఆదేశించారు. అదే విధంగా పెనుగొండ, ధన్నసరి, ఉప్పరపల్లి కొనుగోలు సెంటర్‌ల నుంచి ధాన్యాన్ని పూర్తిస్థాయిలో మిల్లులకు రవాణా చేయించినట్లు తెలిపారు.

నేర్చుకున్నది విద్యార్థులకు బోధించాలి



మాట్లాడుతున్న అబ్దుల్ హై

మహబూబాబాద్ అర్బన్: శిక్షణలో నేర్చుకున్నది విద్యార్థులకు బోధించి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ అబ్దుల్ హై అన్నారు. ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ శిబిరాన్ని అబ్దుల్ హై సందర్శించి మాట్లాడారు. తరగతికి సంబంధించిన విషయ పరిజ్ఞానం, బోధనా మెళకువలు, డిజిటల్ వనరుల వినియోగం, కృత్రిమ మేధ, బోధన అభ్యసనము సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అభ్యసన ఫలితాలు సాధనలో ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేసి జిల్లాను ముందంజలో ఉండే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్ రెడ్డి, ఏసీజీ శ్రీరాములు, సైన్స్ అధికారి అప్పారావు, విజయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీం (బీఏఎస్) నిధులను వెంటనే విడుదల చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంగోత్ చందులాల్‌నాయక్ కోరారు. ఈమేరకు రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్యనాయక్‌కు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని, ఫీజులు కట్టాలని పాఠశాలలు ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల విద్యా బలోపేతానికి దోహదపడుతున్న స్కీంకు నిధులు వెంటనే మంజూరు చేయాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలిగితే ఉద్యమాలు చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పవన్‌నాయక్, రామచంద్రునాయక్ పాల్గొన్నారు.

'కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు'



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గార్ల: అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ శనివారం న్యూడెమొక్రసీ పార్టీ ఆధ్వర్యంలో గార్లలో ప్రదర్శన, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి న్యూడెమొక్రసీ పార్టీ రాష్ట్ర నాయకుడు నందగిరి వెంకటేశ్వర్లు మాట్లాడారు.. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వం పథకాల మంజూరులో ఇలాగే కొనసాగితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శారదకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, సక్రు, మాన్యా, వీరభద్రం, మల్లేష్ పాల్గొన్నారు.

రక్తపోటుపై అవగాహన సదస్సు



పెద్దవంగర: అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

మరిపెడ: ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం రోగులకు రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మంగమ్మ, కృష్ణ, హసీనా, వీరయ్య పాల్గొన్నారు.

బీపీపై అవగాహన పెంచుకోవాలి

పెద్దవంగర: బీపీ తీవ్ర ఒత్తిడితో కూడిన జీవనం, జన్యుపరమైన కారణాలతో వస్తుందని వడ్డెకొత్తపల్లి పల్లె దవాఖానా వైద్యుడు రాజ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కొరిపల్లి గ్రామంలో వరల్డ్ హైపర్ టెన్షన్ డేను పురస్కరించుకొని మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం బూబా, జీపీ కార్యదర్శి హేమలత, ఆశ పుష్పా పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే రక్తపోటు దూరం

తొర్రూరు: పౌష్టికాహారం, పండ్లు, గుడ్లు, ఆకుకూరలు సరిపడ తినడం, వ్యాయామం, మానసిక ఒత్తిడి లేకుండా వంటి జాగ్రత్తలు పాటిస్తే రక్తపోటును నివారించావచ్చని డాక్టర్ రమేశ్ అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తపోటు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

చెరువు పనులు ప్రారంభించాలి

కురవి: చెరువు కట్ట పనులను త్వరగతిన ప్రారంభించాలని ఇరిగేషన్ డీఈ విజయ్‌బాబు సూచించారు. శనివారం సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలోని కొత్తకుంట చెరువు కట్టను పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ నరేష్, క్యూసీ ఏఈ శ్రీనివాసరావు, సీరోలు మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వాలి

బయ్యారం: విద్యుదాఘాతంతో చనిపోయిన గేదెలకు ప్రభుత్వం పరిహారమివ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు మండా రాజన్న డిమాండ్ చేశాడు. శనివారం ఆయన మాట్లాడారు. గేదెలపై ఆధారపడి జీవిస్తున్న పెంపకందారులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు.

విచారణ చేపట్టాలి

కొత్తగూడ: సీఎంఆర్‌ఎఫ్ నిధుల దుర్వినియోగంపై ప్రభుత్వ విచారణ చేపట్టి బాధ్యులపై చర్య తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి మురళీ డిమాండ్ చేశాడు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కొందరు వ్యక్తులు దుర్వినియోగం చేసి లబ్ధిదారులకు దక్కకుండా చేయడం అన్యాయం అన్నారు. ఈ సమావేశంలో తోటకూరి మధు, వాసం రవి, యాకయ్య, ప్రవీన్ పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజమే లక్ష్యం

దంతాలపల్లి: టీబీ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని వైద్యురాలు వాణి అన్నారు. శనివారం మండలంలోని పెద్దముప్పారం పల్లె దవాఖానాలో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ వైద్య శిబిరం నిర్వహించారు.

ధాన్యం కొనుగోళ్లలో అవినీతిని అరికట్టాలి

పెద్దవంగర: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. శనివారం మండలంలోని అవుతాపురం, ఉప్పరగూడెం గ్రామాలల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పాలకొండ కృష్ణామూర్తి శర్మతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో వెంకన్న, సమ్మయ్య, పటేల్ నాయక్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

కంతమహేశ్వరస్వామికి జలాభిషేకం



దోర్నకల్: మండలంలోని గొల్లచర్ల గ్రామంలో శివారులోని కంతమహేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆలయ మూడో వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. గౌడ కులస్తులు గ్రామం నుంచి జలబిందెలతో ఊరేగింపు నిర్వహించి కంతమహేశ్వర విగ్రహానికి జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నూతన కమిటీ ఎన్నిక

బయ్యారం: గొర్రెల, మేకల పెంపకదారుల సంఘం(జీఎంపీఎస్) మండల అధ్యక్షుడిగా దూదిమెట్ల మోహన్‌రావును ఎన్నుకున్నారు. శనివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా వల్లాల వెంకన్న, గౌరవ అధ్యక్షుడు నిమ్మల లింగయ్య, సలహాదారులు నద్దునూరి లింగయ్య, ఉపాధ్యక్షుడు బయ్యా శ్రీను, సహాయ కార్యదర్శిగా బోయిని లింగయ్యతోపాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

బడిబాట



దోర్నకల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సకల వసుతులు కల్పిస్తుందని చిలుకోడు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వీరభద్రరావు తెలిపారు. బడిబాటలో భాగంగా శనివారం వ్యవసాయ భూముల వద్ద పని చేస్తున్న కూలీలు, రైతులను కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు.

భద్రాచలానికి కాలినడకన మాలధారులు

బయ్యారం: భద్రాచలం రాములోరిని దర్శించుకునేందుకు హనుమాన్‌భక్తులు పలు జిల్లాలు దాటుతూ కాలినడకన బయలుదేరారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం దీక్షకుంట్లకు చెందిన పలువురు హనుమాన్ మాలధారులు శనివారం బయ్యారం చేరుకున్నారు. కార్యక్రమంలో మాలధారులు వెంకటేష్, స్వామిరావు, రమేష్, మహేందర్, రాజేష్, రవి, శివాజి పాల్గొన్నారు.

ధాన్యం మిల్లులకు తరలించాలి

మహబూబాబాద్ రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పెట్టిన ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని ఐకేపీ ఏపీఎం తిలక్ గౌడ్ అన్నారు. మండలంలోని కంబాలపల్లి గ్రామంలో గల ఐకేపీ దుర్గ కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం తిలక్ గౌడ్ శనివారం సందర్శించారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా..



నెల్లికుదురు: వరి ధాన్యం బస్తాలతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాకొట్టింది. ఈ సంఘటన ఇనుగుర్తి మండలంలోని చిన్ననాగారంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహులపేట మండలం (పెద్దనాగారం) అజ్మీరతండా గ్రామ శివారు ఎర్రకుంట తండాకు చెందిన బోడ వీరన్న వరిధాన్యం బస్తాలను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని కేసముద్రం మిల్లులకు తరలిస్తున్న క్రమంలో ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామ పరిదిలోని కల్వర్టు వద్ద అదుపుతప్పిన ట్రాక్టర్ ఇంజన్ రోడ్డు పక్కకు దూసుకపోయి ఇంజన్ తిరిగి పడిందన్నారు. ట్రాక్టర్ ఇంజన్ వెనుక బాగంలోని ధాన్యం బస్తాలు కొన్ని కిందపడి పోయాయని ప్రమాదం తప్పిందన్నారు.

ధాన్యం బస్తాలను మిల్లుకు తరలించాలి

నెల్లికుదురు: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి అనుగుణంగా ప్యాడీ క్లీనర్లు ఏర్పాటు చేసి, కాంటాలు పెట్టి ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని శనివారం సీపీఎం ఆధ్వర్యంలో సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు బాబు గౌడ్, వెంకన్న, ఎల్లయ్య, రాములు, అయిలయ్య పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బండెపెల్లి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆలకుంట్ల సాయన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం డివిజన్ కేంద్రంలోని ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జాటోతు భిక్షపతి, లింగయ్య, సాయిలు, వెంకన్న పాల్గొన్నారు.